క్లుప్తంగా

బాధిత విద్యార్థినికి ఎమ్మెల్యే ఆర్థికసాయం



సరస్వతిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

సబ్బవరం: ఇటీవల ఆటో ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అంతకాపల్లి శివారు ఒమ్మివాని పాలేనికి చెందిన కోన సరస్వతిని ఆమె నివాసానికి వెళ్లి స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శనివారం పరామర్శించారు. బాధిరాలికి సొంత నిధుల నుండి రూ. 25 వేల ఆర్థిక సాయం అందించారు. బాధితురాలు సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఇంటర్ చదువుతోంది. ఆమెతో పాటు కుటుంబ సభ్యులతో మాట్లాడి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వం నుండి తగిన ప్రోత్సాహం అందించనున్నట్లు తెలిపారు. బాధితురాలిని పరామర్శించిన వారిలో గ్రామ సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ చొక్కాకుల వెంకటరావు, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు తదితరులు ఉన్నారు.

మెగా లోక్ అదాలత్‌లో 1824 కేసుల పరిష్కారం



ప్రసంగిస్తున్న న్యాయమూర్తి గోవర్దన్

గాజువాక : గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో శనివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు 1824 కేసులను పరిష్కరించారు. అదాలత్‌ను ప్రారంభించిన 13వ అదనపు అదనపు జిల్లా జడ్జి పి.గోవర్దన్ మాట్లాడుతూ కక్షిదారులు తమ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ విధంగా కేసులను పరిష్కరించుకోవడం వల్ల ఇరుపక్షాల మధ్య బంధాలు కూడా మెరుగుపడతాయని పేర్కొన్నారు. అనంతరం వివిధ బెంచ్‌లలో పరిష్కరించిన కేసులకు రూ.3.38 కోట్లను పరిహారంగా చెల్లించినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. న్యాయమూర్తులు ఎస్.విద్య, ఇ.రాజేంద్రబాబు, వై.శ్రీలక్ష్మి, వై.ప్రేమలత, గాజువాక బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం.పట్టాభి రామారావు, ఎం.ఈశ్వరరావు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

వైభవంగా వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురం మూడు ఆలయాల వద్ద సుబ్రహ్మణ్య స్వామి 18 అడుగుల విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఏడాది పూర్తయిన సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో వార్షికోత్సవ పూజలు చేశారు. పూజల్లో జీవీఎంసీ కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, బెహరా విద్యాసంస్థల డైరెక్టర్ బెహరా విజయ చైతన్య పాల్గొన్నారు. విగ్రహ దాత మద్ది రమేష్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలసి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 91వ వార్డు అధ్యక్షుడు గుణిశెట్టి శ్రీనివాసరావు, గేదెల మురళీకృష్ణ, కమిటీ సభ్యులు గొంతెన గణేష్, గొంతిన నాగరాజు, చింతల శ్రీను, పల్లా సూరి బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఇ.కె.సంస్కృతి సదన్‌లో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జగద్గురు పీఠం, డైరెక్టర్ ఆఫ్ సర్వీసెస్ చింతలపాటి సత్యదేవ్ ఒక ప్రకటనలో తెలిపారు. సెవెన్‌హిల్స్ హాస్పిటల్ సౌజన్యంతో హృద్రోగ నిపుణులు డాక్టర్ ఎం.ఎస్.రాజు, డాక్టర్ సిహెచ్.వరప్రసాద్ పర్యవేక్షణలో గుండె వ్యాధుల పరీక్షలు ఈసీజీ, బీపీ, సుగర్, పలు రక్త పరీక్షలు జరపనున్నట్లు చెప్పారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా శస్త్ర చికిత్సలు చేసి, పూర్తి వైద్య సహాయం అందచేస్తామన్నారు. స్థానికులు వైద్య శిబిరంలో పాల్గొని విజయవంతం చేయాలని సత్యదేవ్ కోరారు.

విమానయాన రంగంలో మరిన్ని చట్టాలు రావాలి



ఆచార్య సందీప్ భట్‌కు జ్ఞాపికను అందజేస్తున్న వీసీ డాక్టర్ సూర్యప్రకాష్

సబ్బవరం : ప్రపంచీకరణలో భాగంగా భారతదేశం ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలకు విమానాలను నడపుతుండటంతో ప్రయాణికుల హక్కులను కాపాడేందుకు మరిన్ని చట్టాలు రావల్సి ఉందని హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య బాలకృష్ణారెడ్డి అన్నారు. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో సెంటర్ ఫర్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో విమానయాన చట్టం-విమాన ప్రయాణికులకు సంబంధించిన సమకాలీన అంశాలపై జాతీయ సెమినార్ నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విమానయాన చట్టం వృద్ధికి కారణమైన పబ్లిక్ ఎయిర్ లా, ప్రైవేట్ ఎయిర్ లా, పీనల్ ఎయిర్ లా ఏవియేషన్ సెక్టార్‌కు బాధ్యత వహిస్తాయన్నారు. చికాగో కన్వెన్షన్ మాంట్రియల్ కన్వెన్షన్, వార్సా కన్వెన్షన్ తదితర అంతర్జాతీయ సమావేశాల ద్వారా ప్రతి విభాగానికి మద్దతు ఉందన్నారు. విమాన ప్రయాణీకుల హక్కులకు సంబంధించి చట్టాలు అనేకం ఇంకా రావల్సిన అవసరం ఉందన్నారు. గౌరవ అతిథిగా హాజరైన కోల్‌కతా న్యాయ విశ్వవిద్యాలయ ఆచార్యులు సందీప్ భట్ మాట్లాడుతూ విమానయాన మార్గంలో వివిధ దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు స్నేహపూర్వకంగా ఉండాలన్నారు. దేశాల మధ్య తలెత్తే వివాదాలను ఎలా పరిష్కరించాలో చికాగో కన్వెన్షన్ 1944లోని ఆర్టికల్-84 అంతర్జాతీయ పౌరవిమాన యానానికి సంబంధించిన పరిష్కార యంత్రాగాన్ని అందిస్తుందన్నారు. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య డాక్టర్ సూర్యప్రకాష్ మాట్లాడుతూ ప్రపంచీకరణలో భాగంగా విమానయానానికి కొంత నియంత్రణ అవసరమన్నారు. ఇంటర్నేషనల్ సివిల్ ఏవియేషన్ ఆర్గనైజేషన్‌లో సభ్య దేశంగా ఉన్న భారతదేశం ఎయిర్ ట్రాన్స్‌పోర్టేషన్, కార్గో హ్యాండ్లింగ్‌కు సంబంధించి ప్రపంచ ప్రమాణాలను అనుసరిస్తుందన్నారు. రోజురోజుకు విమానయానాన్ని భారతదేశం మరింత విస్తరిస్తుందని, దీనికోసం భారత ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అంబేడ్కర్ కాలేజ్ ఆఫ్ లా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయలక్ష్మి, డీఎస్ఎన్ఎల్‌యూ సెంటర్ ఫర్ ఐపీఆర్ టెక్నాలజీకి చెందిన ఆచార్య పి. శ్రీసుధ, అసిస్టెంట్ ప్రొఫెసర్ పి. జోగినాయుడు, వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కె. మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న ఆచార్య బాలకృష్ణారెడ్డి

దుమ్ము, ధూళితో సమస్యలు



ఎన్టీపీసీ వద్ద దుమ్ము రేపుతున్న భారీ వాహనాలు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ మెయిన్ గేటు వద్ద నిత్యం ఎగసిపడుతున్న దుమ్ముతో ప్రయాణికులు, కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొటున్నారు. ఎన్టీపీసీ నుంచి బూడిద తరలించేందుకు ఇతర ప్రాంతాల నుంచి భారీ వాహనాలు వచ్చి ఇక్కడ యార్డులో పార్కింగ్‌లో నిలుపుతారు. సీరియల్ ప్రకారం బూడిద తరలింపునకు పిలుపు అందుకున్న వెంటనే ఉరుకుల పరుగులపై బూడిద లోడింగ్ చేసుకుని గమ్యస్థానాలకు వెళ్తుంటారు. ఈ క్రమంలో ఎన్టీపీసీ యార్డు నుంచి లోడింగ్‌కు వెళ్లే భారీ వాహనాలు రేపుతున్న దుమ్ము ధూళితో గ్రామీణ ప్రాంత ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నారు. మెయిన్ గేటు ప్రాంతంలో రేగుతున్న దుమ్ములో ఒకరికొకరు కనిపించకపోవడం వలన తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్డు పక్కన టీ దుకాణాలు, పాన్ షాపులు నడుపుకుంటున్న చిరు వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారు. సామగ్రి బూడిదమయంగా మారడం వలన నష్టాల బారిన పడుతున్నామని చిరువ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ఎన్టీపీసీ మెయిన్ గేటు ప్రాంతంలో ధూళిని నివారించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కార్మికుల పోరాట స్ఫూర్తి 'అద్వితీయం'

- కొనియాడిన ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- ఉక్కు ఉద్యమం ప్రారంభించి రెండేళ్లు
- నేడు డాక్యుమెంటరీ ఆవిష్కరణ



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిరక్షణకు కార్మికుల పోరాటం అద్వితీయమని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఐక్య ఉద్యమాలతో ఉక్కు పరిశ్రమను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో 2021 ఫిబ్రవరి 12న ప్రారంభమైన ఉద్యమం, రెండేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఆదివారం ఉదయం 9 గంటలకు కూర్మన్నపాలెంలోని దీక్ష శిబిరం వద్ద విశాఖ ఉక్కు పేరుతో డాక్యుమెంటరీని వైజాగ్ స్టీల్ ఫ్యామిలీ యూట్యూబ్ చానల్‌లో కె.కె. రావు చేతుల మీదుగా విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కూర్మన్నపాలెం కూడలిలో రిలే నిరాహార దీక్షల్లో 730వ రోజు శనివారం సంస్థకు చెందిన ఎల్ఎంఎం మరియు ఎస్‌బీఎం విభాగ కార్మికులు పాల్గొన్నారు. దీక్షా శిబిరంలో పాల్గొన్న కార్మికులను ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ, అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు, డి.సురేష్, డి.శ్రీనివాస్, గుమ్మడి నరేంద్ర ప్రసంగించారు. విశాఖ ఉక్కు ప్రజలందరి ఆస్తి అన్నారు. దానిని కాపాడుకునేందుకు రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఒక తాటిపైకి వచ్చి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తే సానుకూల స్పందన లభిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ పాలన వల్ల దేశ ప్రజలు దుర్భర పరిస్థితులను అనుభవిస్తున్నారన్నారు. లక్షల కంపెనీలు మూతపడ్డాయని, కార్మికులు పనిలేక రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణలో తగ్గేదే లేదని, కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు

హజ్ యాత్రకు దరఖాస్తు గడువు 10

- విజయవాడలో పాయింట్ ఇవ్వడం అభినందనీయం
- 66వ వార్డు కార్పొరేటర్, హజ్ కమిటీ సభ్యుడు ఇమ్రాన్



సమావేశంలో మాట్లాడుతున్న మహ్మద్ ఇమ్రాన్

గాజువాక : ఆంధ్రప్రదేశ్ నుంచి హజ్ యాత్రకు వెళ్లనున్న ముస్లింలకు విజయవాడలో బయల్దేరే (ఎంబార్కేషన్) పాయింట్‌ను ఇవ్వడంపై స్థానిక ముస్లిం మత పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గాజువాకలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. 66వ వార్డు కార్పొరేటర్, హజ్ కమిటీ సభ్యుడు మహ్మద్ ఇమ్రాన్ మాట్లాడుతూ విజయవాడలో ఎంబార్కేషన్ కల్పించడంపై ముఖ్యమంత్రికి, హజ్ కమిటీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ విషయంలో డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా విశేష కృషి చేశారన్నారు. దీనిపై హజ్ కమిటీ ఆఫ్ ఇండియా హజ్ యాత్ర షెడ్యూల్‌ను కూడా విడుదల చేసిందని, ఈ యాత్రకు వెళ్లాలనుకునేవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వచ్చేనెల 10వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తారని, ఆసక్తిగలవారు www.hajcommittee. gov. in, www. apstatehajcommittee. com ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అభ్యర్థుల పాస్‌పోర్టు ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు చెల్లుబాటులో ఉండాలని, కోవిడ్ వ్యాక్సినేషన్ చేయించుకుని ఉండాలని స్పష్టం చేశారు. ఇతర వివరాల కోసం టోల్ ఫ్రీ నంబర్ 18004257873, 08662471786లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ముస్లిం మత పెద్దలు, వివిధ మసీదు కమిటీల ప్రతినిధులు ఎస్.ఎం.డీ. గౌస్, అలియా నురాని, దుబాయ్ బాషా, ముఫ్తీ జాఫర్, అతుల్ రెహ్మాన్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



విద్యుద్దీపాలతో అలంకరించిన షిర్డీ సాయిబాబా ఆలయం

ఆరిలోవ: చినగదిలిలో నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం పదో వార్షికోత్సవం శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆలయంలో సాయిబాబాను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొని ఘనంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా ఇక్కడ కమిటీ సభ్యులు ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఆలయానికి అలంకరించిన విద్యుత్ దీపాలు భక్తులను ఆకట్టుకొంటున్నాయి. మూడు రోజులు పాటు జరగనున్న ఈ ఉత్సవాలలో భాగంగా శనివారం ఉదయం నుంచి షిర్డీ సాయిబాబాకు పూజలు చేశారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవతో పూజలు ప్రారంభించారు. సాయంత్రం వాయిద్యాలు, భజనలతో బాబా రథాన్ని పురవీధులలో ఊరేగించారు. ఆదివారం ఉదయం 6 గంటలు నుంచి సాయంత్రం 6 గంటలు వరకు ఏకాహం, ఓం సాయి, శ్రీసాయి, జైజై సాయి అనే మాల మంత్ర ఉచ్చారణ జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ వానపల్లి అప్పారావు తెలిపారు.

గంజాయి కేసులో ఏయూ సెక్యూరిటీ గార్డుల అరెస్టు

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): మూడో పట్టణ పరిధిలో గంజాయి కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం రాత్రి బీచ్‌రోడ్డులో అక్రమంగా గంజాయి అమ్ముతున్నారనే సమాచారం మేరకు పోలీసులు, టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఏయూలో సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న చంద్రమౌళి, అప్పలరాజు, సురేష్ వద్ద అక్రమంగా 500 గ్రాములు గంజాయిని గుర్తించారు. ఈ ముగ్గుర్ని అరెస్ట్ చేసి శనివారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

డాక్‌యార్డ్‌లో ఉద్యోగి మృతి

మల్కాపురం: డాక్‌యార్డులో విధులకు వెళ్లిన ఓ ఉద్యోగి విద్యుత్ షాక్ కారణంగా మృతి చెందాడు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... జీవీఎంసీ 58వ వార్డు పరిధి రామ్‌నగర్ ప్రాంతంలో ఒడరేవుల కుమార్‌స్వామి (35) భార్య, ఇద్దరు పిల్లలతో నివసిస్తున్నారు. నేవల్ డాక్‌యార్డ్‌లో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. రోజూ మాదిరిగానే శనివారం ఉదయం ఫస్ట్ షిఫ్ట్‌కు డ్యూటీకి వెళ్లాడు. అనంతరం 8.15 గంటల సమయంలో డాక్‌యార్డ్‌లోని డాక్ వద్ద గల ఓ నౌక దిగువ కుమార్‌స్వామి నీటిలో మునిగి ఉన్నట్లు ఆ సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న సహచర ఉద్యోగులు గుర్తించారు. వెంటనే వారు ఉన్నతాధికారులకు సమాచారమివ్వడంతో కుమార్‌స్వామిని ఐఎన్ఎస్ కల్యాణి ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్టుగా వైద్యులు నిర్ధారించారు. వెంటనే అధికారులు మల్కాపురం పోలీసులకు, మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు ఐఎన్ఎస్ కల్యాణి ఆస్పత్రికి వెళ్లి ఘటనపై ఆరా తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విమాన్‌నగర్‌లో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ట్రస్ట్ సభ్యులు

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు విమాన్‌నగర్‌లో స్థానికుడు వట్టి సత్యనారాయణ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు, స్థానికులు శనివారం చలివేంద్రం ప్రారంభించారు. వీవీఆర్ వాటర్ ప్లాంట్ సౌజన్యంతో శ్రీసాయి చారిటబుల్ ట్రస్ట్, విమాన్‌నగర్ షటిల్ ప్లేయర్స్ సంయుక్త ఆధ్వర్యంలో దీనిని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వి.వి.రమణమూర్తి, గణేష్, షటిల్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ.. ప్రాణానికి రక్షణ



హెల్మెట్ ధారణపై ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వాహన చోదకులు

మర్రిపాలెం: హెల్మెట్ ధరించి వాహనం నడపడం వల్ల ప్రాణాలు కాపాడుకోవచ్చని కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. తాటిచెట్లపాలెం జంక్షన్ వద్ద శనివారం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు నేతృత్వంలో ఎస్ఐ పాపారావు హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపిన 20 మందికి కౌన్సెలింగ్ చేసి జరిమానా విధించారు. ‘వినాయకుడి చిత్రంతో కూడిన తలపోతే మళ్లీ రాదు’ అనే అవగాహన ప్లకార్డు ప్రదర్శించారు. మరో ప్లకార్డులో హెల్మెట్ ధరించండి.. ప్రాణాలను కాపాడుకోండి అంటూ వాహన చోదకులకు అవగాహన కల్పించారు. 69 మంది వద్ద పాత చలానాలు సుమారు రూ.11,370 వసూలు చేశామని ఎస్ఐ పాపారావు తెలిపారు.

అప్పన్నకు విశేషంగా నిత్య కల్యాణం



జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై ఆశీనులను చేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. అర్చకులు చక్రవర్తి తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పొంచి ఉన్న ప్రమాదం

- వర్షాలకు కొట్టుకుపోతున్న రోడ్ల అంచులు
- అజాగ్రత్తగా ప్రయాణిస్తే అంతే సంగతులు



రోడ్ల అంచుల్లో పొంచి ఉన్న ప్రమాదం

పరవాడ: వర్షాలకు రోడ్ల పక్కన మట్టి కొట్టుకుపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలో గాజువాక-అచ్యుతాపురం, పరవాడ-అనకాపల్లి, పరవాడ-లంకెలపాలెం, జాజులవానిపాలెం-కలపాక, లంకెలపాలెం-పెదముషిడివాడ గ్రామాల రహదారుల అంచులు ప్రమాదకరంగా మారాయి. రహదారుల పక్కనున్న మట్టి వర్షాలకు కొట్టుకుపోవడం వలన ఈ ప్రాంతాల గుండా ప్రయాణం ప్రమాదకరంగా మారింది. వాహనచోదకులు ఏమాత్రం అజాగ్రత్తగా వాహనం నడిపినా ప్రమాదాల బారిన పడుతున్నారు. అదే విధంగా భారీ వాహనాలను తప్పించే క్రమంలో రహదారుల అంచుల వలన అదుపు తప్పి వాహనాల కింద పడి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఇటువంటి ప్రమాదాలు పరవాడ సబ్‌స్టేషన్-సినిమా హాలు రహదారిలో చోటు చేసుకున్నాయి. ఇటీవల పరవాడ-అనకాపల్లి వరకు కొత్తగా వేసిన రహదారి పక్కన మట్టిని పూడ్చకపోవడం వలన వాహనం అదుపుతప్పి బోల్తా కొట్టడడం వల్ల భర్నికం గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారు లు ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదాలకు కారణమవుతున్న రోడ్ల అంచులను తక్షణమే పూడ్చేందుకు అధికారు లు చర్యలు తీసుకోవా లని ప్రయాణికులు కోరుతున్నారు.

ఘనంగా సీతారాముల తిరువీధి మహోత్సవం



సీతారాముల తిరువీధి నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సింహాచలం : సింహపురికాలనీలోని 98వవార్డులో జరుగుతున్న రామాలయం 20వ వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి సీతారాముల గ్రామ తిరువీధి మహోత్సాన్ని వైభవంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి తిరువీధి వాహనంలో ఆశీనులను చేశారు. భక్తుల జేజేల మధ్య గ్రామంలో తిరువీధిని కనులపండువగా నిర్వహించారు. కాలనీవాసులు, భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. అంతకు ముందు ఉదయం ఆలయంలో సుదర్శన నారసింహ హవనం, పూజలను అర్చకులు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సీవీఆర్ మూర్తి, సెక్రటరీ ఏవీ చలపతిరావు, కాలనీ నిర్వాసితులు రామారావు, నాయుడు, రాజయ్య తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సబ్బవరం మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా హేమంత్ కుమార్



జెట్టి హేమంత్ కుమార్

సబ్బవరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సబ్బవరం మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా మండలంలోని వంగలికి చెందిన జెట్టి హేమంత్ కుమార్‌ను నియమించారు. అదే విధంగా ఆయనతో పాటు మరో ముగ్గురు కో కన్వీనర్లుగా నియమితులయ్యారు. వీరిలో అమృతపురానికి చెందిన మాసవరపు నవీన్ కుమార్, నారపాడుకు చెందిన ఐ. భవినాష్, రాయపుర అగ్రహారానికి చెందిన నక్కెళ్ల అచ్చిబాబు, సబ్బవరానికి చెందిన బొర్రా జయరాజ్ ఉన్నారు.

పెందుర్తి మండలంలో..

సింహాచలం : పెందుర్తి మండలం వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్లు, కో-కన్వీనర్లను పార్టీ అధిష్టానం నియమించింది. ఈ మేరకు అధికారికంగా ఉత్తర్వులు వెలువడ్డాయి. వైఎస్సార్‌సీపీ పెందుర్తి మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా ఉగ్గిన నాగార్జున నియమితులయ్యారు. అలాగే కో కన్వీనర్లుగా పోతల జగదీష్, గనిశెట్టి ప్రకాష్, బైలపూడి జగన్, సరిపల్లి మహేష్ నియమితులయ్యారు. జీవీఎంసీ 79వ వార్డు కన్వీనర్‌గా కర్రి వినోద్‌కుమార్, 88వ వార్డు కన్వీనర్‌గా పాండ్రంకి సత్తిబాబు, 93వ వార్డు కన్వీనర్‌గా బుడత హరిప్రసాద్, 94వ వార్డు కన్వీనర్‌గా జె. షణ్ముఖ, 95వ వార్డు కన్వీనర్‌గా కంచిబోయిన వెంకట సంతోష్, 96వ వార్డు కన్వీనర్‌గా ఎస్. వెంకటరమణ, 97వ వార్డు కన్వీనర్‌గా పాలశెట్టి సుధీర్‌కుమార్‌లను పార్టీ అధిష్టానం నియమించింది.

గౌరీదేవికి సారె సమర్పణ



గౌరీదేవి సారె ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

- వైభవంగా అనుపు ఉత్సవం

గోపాలపట్నం: గౌరీ దేవికి మహిళలు పెద్ద ఎత్తున సారె సమర్పించారు. కొత్తపాలెంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవాల్లో భాగంగా శనివారం అనుపు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి సారె ఊరేగింపు ఘనంగా జరిగింది. కొత్తపాలెం పరిసర ప్రాంతాల మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి వివిధ వంటకాలతో సారె సమర్పించారు. ఎమ్మెల్యే గణబాబు, స్థానిక కార్పొరేటర్ దాడి వెంకటరమేష్, గౌరి సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పరసతో కిటకిటలాడిన రహదారులు

అనుపు మహోత్సవాల్లో భాగంగా సాయంత్రం పరస జరిగింది. దీంతో రహదారులు కిటకిటలాడాయి. స్థానికులు కుటుంబ సభ్యులతో హాజరు కావడంతో అంతటా సందడి నెలకొంది. పరసలో గృహోపకరణాలు, వివిధ రకాల వస్తువులు, రంగుల రాట్నాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఘనంగా దుర్గాలమ్మ జాతర రాట మహోత్సవం

డాబాగార్డెన్స్: నగరంలోని పూర్ణామార్కెట్ వెలంపేటలో వెలసిన దుర్గాలమ్మ జాతర మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆలయ ప్రాంగణం వద్ద ఉత్సవ రాట అత్యంత వైభవంగా నిర్వహించారు. నాదస్వరాలు, వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా నిర్వహించిన రాట మహోత్స కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు పాల్గొని ఉత్సవాలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ నాయన మల్లిబాబు, ధర్మకర్తలు బత్తి మంగరాజు, కండిపల్లి వరలక్ష్మి, కాండ్రేగుల రూపావతి, రమణమ్మ, చిన్ని గోపాలకృష్ణతో పాటు నాయకులు పాల్గొన్నారు.